సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



రెండో ఏఎన్ఎంల దీక్ష

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రెండో ఏఎన్ఎంలు చేపట్టిన దీక్ష 17వ రోజు శనివారం కొనసాగింది.



'పోరాటం ఆపేది లేదు'

సిరిసిల్లటౌన్: తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.



ఈమె ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం గ్రామానికి చెందిన గిరిజన మహిళ గుగులోతు సరిత. సొంత వ్యవసాయభూమి లేక ఊరిలో ఉపాధి లేక ఎల్లారెడ్డిపేటలో స్వీట్‌కార్న్, జామకాయల వ్యాపారం చేస్తుంది. రోజూ ఉదయం సిరిసిల్లకు వెళ్లి కిలోకు రూ.25 చొప్పున స్వీట్‌కార్న్ కొని ఎల్లారెడ్డిపేటకు తెస్తుంది. వాటిని ఉడికించి ఒకటి రూ.20 చొప్పున విక్రయిస్తుంటుంది. ఇలా రోజుకు కనీసం 30 కిలోల కంకులను విక్రయిస్తూ ప్రతీ రోజు అన్ని ఖర్చులు పోనూ రూ.800 సంపాదిస్తుంది. భర్త రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఇంటికే పరిమితం కాగా.. సరితనే కుటుంబ వ్యవహారాలను నెట్టుకొస్తుంది. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంది.



ఇక్కడ కంకులు కాలుస్తున్న ఎరుకల బాలమణి స్వగ్రామం ఎల్లారెడ్డిపేట. గత నాలుగేళ్లుగా ఇక్కడే కంకులు కాలుస్తుంది. ప్రతీ సీజన్‌లో కంకులు కాలుస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తుంది. కామారెడ్డి నుంచి కంకులబ్యాగులను ఆటోల ద్వారా తెప్పించుకుంటుంది. ఒక బ్యాగులో 70 నుంచి 80 కంకుల వరకు ఉంటుండగా.. బస్తాకు రూ.800 చెల్లిస్తుంది. కంకులను కాల్చి అమ్మితే ఖర్చులు పోనూ రోజుకు రూ.800 చొప్పున నెలకు రూ.24వేలు సంపాదిస్తుంది. భర్త సంపాదనకు తోడుగా నిలుస్తూ కుటుంబ పోషణలో భాగమవుతుంది.

సండే స్పెషల్

దారిచూపిన మక్క

- మక్కకంకులు..మక్కరొట్టెలు అమ్ముతూ జీవనం
- ఆర్థికంగా స్థిరపడుతున్న గిరిజన మహిళలు
- కుటుంబాలకు అండగా నిలుస్తున్న వైనం
- సారాకు స్వస్తి.. మక్కకంకులతో దోస్తీ
- ఆరోగ్య ఆహారంపై ప్రజల ఆసక్తి



రొట్టెలు చేస్తున్న ఈమె ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం గ్రామానికి చెందిన ముదావత్ కమల. ఒకప్పుడు సారా అమ్ముతూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడగా జైలుకు పంపారు. జైలు నుంచి బయటకు వచ్చిన కమల కొత్త ఆలోచనతో ఉపాధి మార్గాన్ని ఎంచుకుంది. సహజంగానే తండాలలో మొక్కజొన్న విస్తారంగా వేస్తారు. తను పండించే మక్కకంకులతోపాటు కామారెడ్డి, నిజామాబాద్ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు మక్కలను కొని వాటిని పిండిగా పట్టిచ్చి రొట్టెలు చేస్తుంది. రాచర్లగొల్లపల్లి శివారులోని సిరిసిల్ల - కామారెడ్డి ప్రధాన రహదారిపై రొట్టెలు చేస్తూ విక్రయిస్తుంది. రోజుకు కనీసం వంద వరకు రొట్టెలు చేస్తూ అమ్ముతుంది. అన్ని ఖర్చులు పోను రోజు రూ.వెయ్యి సంపాదిస్తుంది. ఇలా కమలతోపాటు గుండారం గ్రామానికి చెందిన మరో ముగ్గురు మహిళలు రొట్టెలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సారాయి కాచిన చేతులు.. కంకులు కాలుస్తున్నాయి. బెల్లం ఉడికించిన మనుషులే.. స్వీట్‌కార్నులు ఉడికిస్తున్నారు. సారా ప్యాకెట్లు కట్టిన మహిళలు.. మక్కరొట్టెల చేస్తూ విక్రయిస్తున్నారు. భయం.. భయంగా గుడుంబా తరలించి కేసుల పాలైన వారే.. నేడు సమాజంలో తలెత్తుకొని స్వీట్‌కార్న్, మక్కకంకులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు చిన్నచూపు చూసిన వారే.. నేడు వారి దగ్గరికొచ్చి మక్కకంకులు.. మక్కరొట్టెలు కొంటూ కుశలప్రశ్నలు వేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని తండాల వాసులు సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి వెంట నిత్యం స్వీట్‌కార్న్, మక్కరొట్టెలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. సారాకు స్వస్తి చెప్పి.. మక్క ఉత్పత్తులతో దోస్తీ చేస్తున్న గిరిజన మహిళలపై ప్రత్యేక కథనం..



నాడు కోర్టుల చుట్టూ..

తండాల్లో ఒకప్పుడు దుర్భర జీవితాలు గడిపిన గిరిజనులు సారా తయారీ, అమ్మకాలతోనే తమ కుటుంబాలను పోషించుకునేవారు. ఈ క్రమంలో పోలీస్, ఎక్సైజ్ కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా తీవ్ర నష్టాలకు గురయ్యారు. సారా తయారీని వారసత్వంగా వారి పిల్లలు సైతం అదే బాటను అనుసరిస్తూ కేసులపాలయ్యారు. ఈ క్రమంలోనే అనేక సందర్భాల్లో సిరిసిల్ల, వేములవాడ లాంటి పట్టణాలకు సారాను తరలిస్తున్న క్రమంలో వాహనాలపై అతివేగంగా వెళ్తూ పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ పరిస్థితుల నుంచి మారినకాలానికి అనుగుణంగా వారి జీవన శైలిని మార్చుకున్నారు. వారి పిల్లలు తలెత్తుకొని బతికేలా మక్కకంకులు, మక్కరొట్టెలు, స్వీట్‌కార్న్ వ్యాపారం ప్రారంభించారు.

కుటుంబాలకు అండగా..

సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి వెంట మక్క కంకులు, మక్కరొట్టెలు అమ్ముతున్న గిరిజన మహిళలు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడుతున్నారు. ఒకప్పుడు కేసులపాలై అప్పులపాలైన కుటుంబాలను గట్టెక్కించుకుంటున్నారు. వారి పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి సంపాదనలో సగం స్కూల్ ఫీజుల కోసం వెచ్చిస్తున్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం వారి జీవన విధానాలనే మార్చుకోవడం సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది.

ఆరోగ్య ఆహారం.. పెరిగిన వినియోగం

మారిన ఆహారపు అలవాట్లతో చాలా మందికి జీర్ణ సమస్యలు వస్తున్నాయి. ఈక్రమంలో ఫైబర్ ఎక్కువగా ఉండే మక్కకంకులు, మక్కరొట్టెలు రెడీమేడ్‌గా లభిస్తుండడంతో చాలా మంది రాత్రి పూట ఆహారంగా మక్కరొట్టెలు తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. వైద్యులు సైతం ఇలాంటి ఆహారాన్ని తినాలని సూచిస్తుండడంతో మక్క ఆహార ఉత్పత్తులపై ప్రజలకు ఆసక్తి పెరిగింది. జీర్ణ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మొత్తంగా అటు గిరిజన మహిళలకు ఉపాధినివ్వడమే కాకుండా.. ఇటు ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నాయి.

పదేళ్లుగా కంకులు అమ్ముతున్న



నేను గతంలో వ్యవసాయ పనులకు దినసరి కూలీగా వెళ్లేదాన్ని. రోజంతా పనిచేస్త అప్పుడు రూ.100 కూడా వచ్చేది కాదు. దీంతో కుటుంబాన్ని వెల్ల దీయడం కష్టంగా మారింది. పదేళ్ల క్రితం కంకులు కాల్చి అమ్మే వ్యాపారాన్ని ప్రారంభించాను. ఇప్పుడు రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు సంపాదిస్తున్న. కుటుంబ ఖర్చులు పోను డబ్బులు వెనకేసుగలుగుతున్న.

– అనుప కనకవ్వ, ఎల్లారెడ్డిపేట

ఏ పని దొరక్క..



బీఎస్సీ చదువుకున్న నాకు ఏ పని దొరకలేదు. చేసేదేమి లేక, ఇంటి దగ్గర ఖాళీగా కూర్చోలేక.. తల్లిదండ్రులకు తోడుగా ఉండాలనే సంకల్పంతో మక్కకంకులు అమ్ముతున్న. నిత్యం అన్ని ఖర్చులు పోను రూ.400 వరకు సంపాదిస్తున్న. చదువుకున్నప్పటికీ నామోషిగా భావించకుండా ఏదో ఒక పనిచేయాలనే ఉద్దేశంతో కంకులు కాల్చుతూ అమ్ముతున్న.

– బానోత్ శ్రావణ్‌కుమార్, బీఎస్సీ పట్టభద్రుడు



అనుబంధాల తీజ్

ఉమ్మడి జిల్లాలోని గిరిజన తండాల్లో తీజ్ సందడి నెలకొంది. తరతరాలుగా వస్తున్న సంప్రదాయంగా ఈ తీజ్ పండుగను గిరిజనులు జరుపుకుంటారు. ఈ పండుగ బతుకమ్మను పోలి ఉంటుంది. తీజ్‌ను ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు. ఏటా శ్రావణమాసంలో జరిగే ఈ సంబరాలు అంబరాన్నంటుతాయి. మంచి వరుడు దొరకాలని పెళ్లీడుకొచ్చిన యువతులు తొమ్మిది రోజులపాటు పూజలు చేయడం ఈ వేడుక ప్రత్యేకత. – సాక్షి, కరీంనగర్ డెస్క్



సంస్కృతిని కాపాడుకుందాం

మాకు ప్రత్యేకమైన భాష, ఆచారం, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా మా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటున్నాం. భవిష్యత్‌లో కూడా వాటిని కాపాడుకుంటాం. తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి. రాబోయే కాలంలో తీజ్ పండుగను ప్రభుత్వం గుర్తిస్తుందని భావిస్తున్నాం.

– అజ్మీర శృతి, జగదాంబ తండా, గంభీరావుపేట

- తండాల్లో తీజ్ సంబురం
- ముస్తాబైన గిరిజన గూడేలు
- శ్రావణమాసంలోనే వేడుకలు
- తొమ్మిది రోజులు సందడి
- గోధుమనారుకు పెళ్లికాని యువతుల నిష్టతో పూజలు

తొమ్మిది రోజులు.. కఠిన నియమాలు

పెళ్లికాని యువతులు వెదురుబుట్టలో పుట్టమట్టిని తెచ్చి అందులో నవధాన్యాలు విత్తుతారు. తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలు ఉంటూ నిత్యం ఉదయం, సాయంత్రం వెదురుబుట్టలో విత్తిన గోధుమనారుకు నీళ్లు పోస్తూ పూజలు చేస్తారు. ఏడో రోజు ఢమోళి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతీ ఇంట్లో బియ్యం పిండితో చుర్మో రొట్టెలు చేసి వాటిని బెల్లంతో కలిపి ముద్దలు చేస్తారు. తీజ్ ఉన్న ఇంటి ఆవరణలో సేవాబాయి, మెరామల పూజలు నిర్వహిస్తారు. మెరామల పూజ చేసే ఇంటి ముందు జొన్నలు నింపిన గోనె సంచులు ఉంచి దానిపై ఒక చిన్న బిందెలో నీళ్లు పోసి వేప మండలు వేస్తారు. తీజ్ నేపథ్యంలో తొమ్మిది రోజులు అమ్మాయి కఠిన నియమాలు పాటిస్తారు. ఉప్పు, కారం లేని భోజనం తినాలి. తండా నుంచి బయటకు వెళ్లకూడదు. నేలపై పెట్టకుండా బావి నుంచి నీటిని బిందెలో తెచ్చి పందిరిపై పోస్తారు.

యువతుల నృత్యాలు.. పాటలు

తీజ్ తొమ్మిది రోజుల పండుగ. ఆటపాటలు, యువతుల నృత్యాలతో గిరిజన గూడేలలో పండుగ వాతావరణం నెలకొంటుంది. గోధుమ నారును ఎనిమిది రోజులపాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు. పెళ్లి కాని ఆడపిల్లలే ఈ వేడుక నిర్వహిస్తారు.

ఏర్పాట్ల బాధ్యత వారిదే..

వరి నాట్లు వేయడం పూర్తి కాగానే యువతులు తండా పెద్ద అనుమతి తీసుకొని ఏర్పాట్లు చేస్తుంటారు. ఇంటింటికెళ్లి విరాళాలు సేకరించి, అంగడికెళ్లి గోధుమలు, శనగలు, ఇతర సామగ్రి తెస్తారు. గోధుమలు నానబెట్టడానికి దుస్సేరు తీగలతో బుట్టలను అల్లి, పుట్ట మట్టిని తెచ్చి అందులో మేక ఎరువు కలుపుతారు. మెదట తండా నాయకుడి చేత ఎరువు కలిపి మట్టిని పోయించి గోధుమలను చల్లిస్తారు. శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్, సీతా మేరమా మాతతోపాటు తిరుపతి బాలాజీ, హాథీరాం బాలాజీ, వేములవాడ రాజన్న, తుల్జా భవానీలను కొలుస్తారు.

ఉమ్మడి జిల్లాలో

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గిరిజనులు అధికంగా ఉన్న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, ముస్తాబాద్, మండలాలతో పాటు కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం, కరీంనగర్ సిటీ, చింతకుంటశాంతినగర్, జగిత్యాల జిల్లా రాయికల్, సారంగాపూర్‌లో తీజ్ వేడుకలు నిర్వహిస్తారు.

అసలేరు కార్తెలో..

శ్రావణమాసం అసలేరు కార్తీ ప్రారంభంకాగానే తండాల్లో తీజ్ వేడుకలు మొదలవుతాయి. తండా పెద్ద మనిషి ఇంటి ఎదుట పందిరి ఏర్పాటు చేసి, దానిపై గోధుమబుట్టలను పెడతారు. ఈ గోధుమ బుట్టలపై యువతులు నిత్యం ఉపవాసంతో నీరు పోస్తుంటారు. పండుగ ముగిసే వరకు వీరు ఒక్కపూట భోజనం చేస్తారు.

గోధుమ నారుతో ఊరేగింపు

తీజ్‌లో ప్రధాన ఘట్టం చివరి రోజు పందిరిపై ఉంచిన గోధుమనారు బుట్టలను కిందికి దింపి వాటి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేస్తారు. అనంతరం గోధుమనారు బుట్టలను నెత్తిపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని వాగులలో నిమజ్జనం చేస్తారు. శ్రావణమాసం ప్రారంభంలో మొదలు పెట్టిన తీజ్ ఉత్సవాలు చివరి వారంలోపు ముగుస్తాయి.

తీజ్ అంటే ఆనందం



తీజ్ అంటే ఒక ప్రత్యేకమైన పండుగ. దీన్ని మేము ఆనందోత్సాహాలతో జరుపుకుంటాం. తీజ్ బుట్టలను తొమ్మిదవ రోజున మేము నిమజ్జనానికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకెళ్తాం. గోర్ ప్రజల బతుకమ్మ తీజ్ కాబట్టి మహిళా ట్రైబల్ గురుకులాల్లో ప్రత్యేకమైన సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. – మూడ్ మౌనిక, జగదాంబ తండా, గంభీరావుపేట



తొమ్మిది రోజులు ఆటపాటలతో..

తీజ్ పండుగను తొమ్మిది రోజుల పాటు ఆనందోత్సాహాలతో, ఆటపాటలతో నిర్వహించుకుంటాం. తీజ్ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే తీజ్‌లో నవధాన్యాలు, గోధుమ మొలకలను పూజించడం ఆనవాయితీ. తీజ్ దేవత పంటలను, ప్రకృతిని కాపాడుతుందని మా ప్రగాఢ విశ్వాసం. – అజ్మీర సాహితి, జగదాంబతండా, గంభీరావుపేట



గోధుమనారుతో యువతులు

న్యూస్‌రీల్


మెడికల్ కాలేజీలో 63 అడ్మిషన్లు



మెడికల్ కాలేజీలో చేరుతున్న విద్యార్థిని

సిరిసిల్ల: సిరిసిల్ల మెడికల్ కాలేజీలో శనివారం వరకు 63 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కేంద్రం కోటాలో నలుగురు, రాష్ట్రం కోటాలో 59 మంది ప్రవేశాలు పొందినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. సిరిసిల్ల మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం వైద్యవిద్య తరగతులు సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభిస్తామని వివరించారు.

బస్సు సౌకర్యంతో తీరిన విద్యార్థుల కష్టాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల ఆర్టీసీ డిపో నుంచి వీర్నపల్లి మోడల్‌స్కూల్‌కు శనివారం వివిధ గ్రామాల మీదుగా బస్సును ప్రారంభించడంతో 60 మంది విద్యార్థుల ప్రయాణ కష్టాలు తీరాయి. ఇంతకాలం బస్సు లేక విద్యార్థుల పడ్డ కష్టాలు దూరమయ్యాయి. మండలంలోని పదిర, రాగట్లపల్లి, ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్ గ్రామాలకు చెందిన 60 మంది విద్యార్థులు వీర్నపల్లి మోడల్‌స్కూల్‌లో చదువుకుంటున్నారు. బస్సు లేక స్కూల్‌కు వెళ్లేందుకు వారు పడుతున్న ఇబ్బందులను మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ ఆర్టీసీ డీఎం మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఎం వెంటనే రూట్ సర్వే చేయించి, బస్సును ప్రారంభించారు.

వెల్లివిరిసిన హరిత చైతన్యం



చంద్రగిరిలో కలెక్టర్ అనురాగ్ జయంతి



మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ జిందం కళ



వేములవాడలో చైర్‌పర్సన్ మాధవి

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా శనివారం ఒక్క రోజే 2.50 లక్షల మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రోజే కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లోనూ హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. 2.40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా.. జిల్లావ్యాప్తంగా 2,50,655 మొక్కలు నాటారు. జిల్లాలో 104 శాతం లక్ష్యం సాధించారు.

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: హరితహారంలో భాగంగా శనివారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సిరిసిల్లలో బైపాస్‌రోడ్డు ప్రాంతంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మొక్కలు నాటి మాట్లాడారు. పౌరులు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని 6వ వార్డులో నీలం కళ్యాణి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, వేములవాడ కౌన్సిలర్లు గోలి మహేశ్, జోగిని శంకర్, మేనేజర్ సంపత్‌రెడ్డి, నాయకులు జడల శ్రీనివాస్, రామతీర్థపు రాజు, నీలం శేఖర్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్:భావితరాలకు ఆహ్లాదకర జీవన విధానం అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. స్వాతంత్య్ర వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం వేములవాడ మండలం చంద్రగిరిలో వృక్షార్చనలో కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి మొక్కలు నాటారు. అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఎంపీపీ బూర వజ్రమ్మ, ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్ రాసూరి రాజేశ్ ఉన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ అభివృద్ధి


- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: వేములవాడ రాజన్న సన్నిధిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అభివృద్ధి పనులు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వేములవాడ ఆలయ అభివృద్ధి అథారిటీ(వీటీడీఏ) అధికారులతో సమీక్షించారు. విగ్రహాల ఏర్పాటు, ఫౌంటేయిన్ నిర్మాణం, ప్రవేశ ద్వారాలు, లైటింగ్ పనులు సెప్టెంబరులోగా పూర్తి చేయాలన్నారు. గుడి చెరువు అభివృద్ధిపై సమీక్షించారు. వీటీడీఏ అధికారి సమ్మయ్య, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ.. నమోదుపై ప్రచారం

ఓటర్ల నమోదు, సవరణలపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. మృతుల పేర్లు తొలగించి, అర్హులకు స్థానం కల్పించాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎస్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, గంగయ్య పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2023, రెండో ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని ప్రభుత్వ పాఠశాల, గాంధీనగర్ స్కూల్, గాంధీవీధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కొత్తగా ఎంత మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారనే విషయాలు తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. ఓటరుగా నమోదుకు సెప్టెంబర్ 19 వరకు అవకాశం ఉందని తెలిపారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మహేశ్ ఉన్నారు.



వీటీడీఏ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

వేములవాడలోని గాంధీవీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

ఉమెన్స్ హాస్టల్ భవనం పూర్తి చేయండి

సిరిసిల్ల: జిల్లా కేంద్రం శివారులోని బైపాస్ రోడ్డులో సఖీ సెంటర్ పక్కన నిర్మిస్తున్న వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవనాన్ని పది రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేసి సెప్టెంబర్ 5లోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

31న నూలు పౌర్ణమి ఉత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 31న నూలు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. ఈమేరకు పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఉదయం ఆలయంలో రక్షాబంధనం, యజ్ఞోపవితరణ, సాయంత్రం పట్టణ వీధుల్లో మార్కండేయ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

29న చలో మైదాన్

సిరిసిల్లకల్చరల్: హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ఈనెల 29న చలో మైదాన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల శాఖాధికారి అజ్మీర రాందాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక మినీస్టేడియంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి వాలీబాల్ పోటీలతోపాటు క్రీడలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, క్రీడా సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల గురుకులంలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో విద్యార్థుల ప్రవేశాలకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శనివారం ప్రకటనలో కోరారు. ఎంపీసీలో ఎస్సీ -6, ఎస్టీ-1, ఓసీ-1, బైపీసీలో బీసీ -1, ఎస్టీ -1 సీట్లు అందుబాటుల్లో ఉన్నాయని తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గిరిజన ఏకలవ్య గురుకులం పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.రామారావు శనివారం ప్రకటనలో కోరారు. ఎంపీసీలో 3, బైపీసీలో 5, సీఈసీలో ఒక్క సీటు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28లోగా అర్హులైన గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆసరా పేరిట దోపిడీపై ఆరా

సిరిసిల్లక్రైం: ఆసరా పెన్షన్ ఇప్పిస్తానని పలువురు మహిళల వద్ద రూ.లక్ష వరకు దండుకున్న మోసగాడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. 'ఆసరా పేరిట దోపిడీ' పేరిట సాక్షిలో శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై వేములవాడ, సిరిసిల్ల పోలీసులు దర్యాప్తు చేసి వేములవాడ అర్బన్ పరిధిలో మారుపాకలో వివరాలు సేకరించినట్లు తెలిసింది. మోసం జరిగిన తీరు, ఇంకెవరైన మోసగాడి చేతిలో ఆర్థికంగా నష్టపోయారా.. అనే విధానంలో వివరాలను పోలీసులు సేకరించినట్లు మారుపాకలోని స్థానికులు తెలిపారు. డబ్బులు దండుకున్న లింగయ్యగౌడ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతుంది. బాధితులు సిరిసిల్ల కావడంతో ఇదే విషయయాన్ని సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా అదుపులోకి తీసుకున్న వివరాలను ధ్రువీకరించలేదు.

మరమగ్గాలకు ఉచిత విద్యుత్



సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్



వేములవాడలో బైక్ ర్యాలీ

- అందుబాటులో ఉంటా.. అండగా నిలుస్తా
- సిరిసిల్ల ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సిరిసిల్ల మరమగ్గాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తెలిపారు. సిరిసిల్లలో శనివారం రాత్రి నిర్వహించిన బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కొడుకు కాకుంటే కేటీఆర్‌ను కుక్కలు కూడా దేకయన్నారు. సిరిసిల్ల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఇకపై సిరిసిల్ల ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలా అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

సెస్ ఎన్నికల్లో నైతిక విజయం మాదే

సెస్ ఎన్నికల్లో నైతిక విజయం బీజేపీదేనని, వారు అడ్డదారుల్లో గెలిచి సంబరపడ్డారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ కేటీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేశారని, 12 మంది ఇండిపెండెంట్లు గెలిచారని గుర్తుచేశారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని క్షమించమని హెచ్చరించారు. బహిరంగ విమర్శలు చేసుకోవద్దని సూచించారు. ఎంపీగా అభివృద్ధి పనులు చేద్దామంటే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధికి అనుమతి ఇవ్వడం లేదని, రైల్వే లైన్‌కు భూసేకరణ చేయడం లేదని, రోడ్లు వేస్తామంటే సహకరించడం లేదని పేర్కొన్నారు. అన్నీ తామే చేస్తామంటూ కేంద్రం నిధులను మళ్లిస్తున్నారని ఆరోపించారు.

బీజేపీలో చేరిన యువకులు

సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ స్వర్గం రాజు ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అయిన తరువాత తొలిసారి సిరిసిల్లకు వచ్చిన బండి సంజయ్‌ని లగిశెట్టి శ్రీనివాస్ గజమాలతో సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లగిశెట్టి శ్రీనివాస్, ఆవునూరి రమాకాంత్ రావు, చక్రధర్‌రెడ్డి, నాయకులు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, ఆడెపు రవీందర్, రెడ్డిబోయిన గోపి, నాగుల శ్రీనివాస్, అన్నల్‌దాస్ వేణు, బర్కం లక్ష్మి, నవీన్ యాదవ్, గరిపెల్లి ప్రభాకర్, వాసు, చందు పాల్గొన్నారు

బీజేపీ నేతలపై ముస్లిం మహిళ ఫిర్యాదు

సిరిసిల్లకు చెందిన బీజేపీ నాయకులు రాజాసింగ్, మేకల కమలాకర్ తన ఇంటిని కబ్జా చేశారని సిరిసిల్లకు చెందిన ముస్లిం మహిళ బండి సంజయ్‌కు వేదికపైనే ఫిర్యాదు చేశారు. తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని వేధిస్తున్నారని తెలిపారు.

రాజన్న సేవలో బండి సంజయ్

వేములవాడ: రాజన్నను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ శనివారం దర్శించుకున్నారు. ఆయన వెంట కరీంనగర్ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ ఇన్‌చార్జీలుగా నియమితులైన ఎమ్మెల్యేలు సీకే రామ్మూర్తి, బస్వరాజ్ మట్టిముడ్, దిగంత కలిత, ధమేశ్వర్ కొన్వర్, శశాంక్ త్రివేది స్వామిని దర్శించుకున్నారు. కల్యాణమండపంలో ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు కండువాలు కప్పి, ప్రసాదం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు, ఎంపీపీ బండ మల్లేశం, ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు తదితరులు ఉన్నారు.

వేములవాడలో బైక్ ర్యాలీ

వేములవాడలోని భీమేశ్వరగార్డెన్ నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు ఎంపీ బండి సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

రమేశ్‌బాబుకు అభినందనలు



రమేశ్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆగయ్య



రాజన్న ప్రసాదం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర వ్యవసాయరంగ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పూలబొకేతో సన్మానించారు. రాష్ట్ర టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ ఉన్నారు.

రాజన్న ప్రసాదం

ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్న ప్రసాదం అందించారు.

కాటన్ వస్త్రోత్పత్తికి మహర్దశ

- మంత్రి కేటీఆర్ చొరవతో స్టడీటూర్
- చేనేత వస్త్రవ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్



మాట్లాడుతున్న తాటిపాముల దామోదర్

సిరిసిల్లటౌన్: కుదేలైన సిరిసిల్ల కాటన్ వస్త్రోత్పత్తిలో కొత్తరకాల గుడ్డ ఉత్పత్తితో పరిశ్రమకు మహర్దశ రానుందని చేనేత వస్త్రవ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల సాంచాలపై బ్యాండేజీ వస్త్రాన్ని ఉత్పత్తి చేసేందుకు పలువురు వ్యాపారులు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. కాటన్ వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి మంత్రి కేటీఆర్ సూచనలతో కొద్ది రోజుల క్రితం 26 మందితో తమిళనాడుకు స్టడీటూర్ వెళ్లినట్లు తెలిపారు. అక్కడ 25 వేల సాంచాలపై బ్యాండేజీ వస్త్రం ఉత్పత్తి అవుతుందని, అలాంటి గుడ్డను సిరిసిల్ల సాంచాలపై తయారు చేస్తామని ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. చేనేత వస్త్రవ్యాపార సంఘం ప్రధాన కార్యదర్శి గౌడ రాజు, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, సైజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల వెంకటనర్సు, డైయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుక రాజేశం, కట్టికోల లక్ష్మీనారాయణ ఉన్నారు.

13 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసి ఉపాధ్యాయ భర్తీ నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులను చూపారని దాన్ని మార్చుతూ 13వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని శివనగర్ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఒకే ఒక టీఆర్టీ నిర్వహించి 8,700 పోస్టులను భర్తీ చేసిందన్నారు. ఎన్నికల్లో మళ్లీ అభ్యర్థుల ఓట్లను దండుకోవడానికే చాలీచాలని పోస్టుల భర్తీకి ముందుకురావడం సరికాదన్నారు. నాయకులు దుమాల రమానాథ్‌రెడ్డి, పూరెల్లి రవీందర్, పంజాల వెంకన్న, పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, సూర భాస్కర్, తాళ్లపల్లి శ్రీధర్, రేగుల శ్రీనివాస్, చకినాల రామచంద్రం, పొన్నం శ్రీనివాస్, మహేశ్, తాటికొండ సంజీవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: పెద్దూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మధుకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సిరిసిల్లతోపాటు పెద్దూరు, సర్దాపూర్, బోనాల, ముష్టిపల్లి, చంద్రంపేట, రగుడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

బుగ్గరాజేశునికి దివ్యాంగుల మొక్కులు



మొక్కులు చెల్లించుకున్న దివ్యాంగులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ సల్లంగా ఉండాలే..మళ్లీ ఆయనే సీఎం కావాలే.. అని కోరుతూ దివ్యాంగులు శనివారం ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు అక్కపల్లికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రూ.4,016 పెన్షన్ పెంచారన్నారు. కేసీఆర్ మరోమారు సీఎం అయితే వికలాంగులు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. బాలచందర్‌రావు, మామిడాల నరేశ్, రాజేశ్, హరిప్రసాద్, పర్శరాములు, గాజుల రవి, రాము పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడేలా పనిచేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లక్రైం: నేరాలు చేసిన వారికి శిక్షలు పడేలా పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం కోర్టుల్లో పెండింగ్ కేసులు, వారెంట్స్, సమన్స్ తదితర అంశాలపై సంబంధిత కోర్టు, పోలీసు అధికారులతో సమీక్షించారు. కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పుచేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడంతో ప్రజలకు పోలీస్‌శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందన్నారు. కేసుల్లో శిక్షల అమలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కేసు గెలువడానికి, సత్వర పరిష్కారానికి కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైందని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుంచి కేసు పూర్తయ్యే వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలం కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారుల పనితీరులో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. బాధితులకు, సాక్షులకు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలని తెలిపారు. కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయంలో పీపీల సలహాలు సూచనలు స్వీకరించాలని సూచించారు. ఏఎస్పీ చంద్రయ్య, సీఐలు శశిధర్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ రఘుపతి, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు 1930

జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు బాధితులు వెంటనే 1930 ఫిర్యాదు చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. సైబర్ నేరాలు జరుగు తీరు దానిపై ప్రజలు అనుసరించాల్సిన విధానాలపై మీడియాతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడం వల్ల నేరాలకు తావులేకుండా చేసేందుకు వీలుంటుందన్నారు. తక్కువ ధరకు వస్తువులు, పోటీ పరీక్షలు లేకుండా ఉద్యోగాలు, బ్యాంకు పేరిట ఫోన్ వస్తే సమాచారం ఇవ్వడం, లాటరీ తగిలిందంటే దానికి ఆశపడి ముందస్తుగా డబ్బులు చెల్లించొద్దన్నారు. నేరాలు జరిగితే వెంటనే 1930 ఫిర్యాదు చేయడంతోపాటు డయల్ 100 కాల్ చేయాలని సూచించారు.

సంక్షేమ పథకాలకు కోత పెట్టడమే ఇందిరమ్మ రాజ్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



పెన్షన్ ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇందిరమ్మ రాజ్యం అంటే సంక్షేమ పథకాలలో కోత పెట్టడమేనని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. ఇల్లంతకుంటలోని వైశ్యాభవన్‌లో వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు పెరిగిన ఆసరా పెన్షన్ ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ 40 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంతం అన్యాయానికి గురైందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు రూ.200 పెన్షన్ ఉండేదని, కేసీఆర్ సీఎం అయ్యాక దివ్యాంగులకు రూ.4,016, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడికార్మికులకు రూ.2,016 పెన్షన్ అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం ఇల్లంతకుంటలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రసమయిని మైనారిటీలు కలిసి దట్టి కట్టి సన్మానించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, సింగిల్‌విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఎంపీడీవో మీర్జా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



లక్ష్మి మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులోని పెట్రోల్‌పంపు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన మతిస్థిమితం లేని చెంచు లక్ష్మి ఉరఫ్ లచ్చవ్వ(62) మృతి చెందింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. వృద్ధురాలు లక్ష్మి శనివారం ఉదయం నుంచి గ్రామంలో తిరుగుతుంది. మధ్యాహ్నం గ్రామస్తులే భోజనం పెట్టారు. రాత్రి వేళ సిరిసిల్ల -కామారెడ్డి ప్రధాన రహదారిపై సంచరిస్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రైతుల వేషధారణలో విద్యార్థులు



పొలం గట్టుపై రైతుల వేషధారణతో ఉన్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు రైతుల వేషధారణతో గ్రామశివారులోని పొలాల వద్దకు ఫీల్డ్ వర్క్ కోసం వెళ్లారు. నిత్యం పాఠశాలలో ఉండి చదువుకోవాల్సిన చిన్నారులు శనివారం పొలాల వద్దకు వెళ్లి గట్ల వెంబడి తిరిగి పంట గురించి తెలుసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రజిత విద్యార్థులకు సైన్స్ పుస్తకంలోని పాఠ్యాంశంలో భాగంగా వ్యవసాయం గురించి, రైతులు చేసే పనులపై అవగాహన కల్పించారు.

చిప్పలపల్లిలో చోరీ

- వెండి, నగదు అపహరణ

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. చిప్పలపల్లికి చెందిన మౌనిక తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికెళ్లింది. శుక్రవారం ఇంటి తాళాన్ని దొంగలు పగులకొట్టారు. బీరువాలో దాచిన రూ.5వేలు, బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించిన చుట్టుపక్కల వారు మౌనికకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నుంచి హుటాహుటిన చిప్పలపల్లికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్లూస్ టీం వివరాలు సేకరించారు. కాగా రెండు రోజుల క్రితమే నారాయణపురం చంద్రం కిరాణ దుకాణంలో దొంగలు పడి వస్తువులు, నగదు ఎత్తుకెళ్లారు. రెండు రోజుల్లో రెండు చోరీలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

క్రీడోత్సవం..ఉత్తేజభరితం





త్రోబాల్ వేస్తున్న మహిళ



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు



క్రీడలకు హాజరైన మహిళలు

ఈషా ఆధ్వర్యంలో సిరిసిల్లలోని మినీస్టేడియంలో శనివారం ప్రారంభమైన క్రీడోత్సవాలు ఉత్తేజభరితంగా సాగాయి. వాలీబాల్, త్రోబాల్ క్రీడల్లో 16 నుంచి 80 ఏళ్ల వయస్సు వారు పాల్గొన్నారు. త్రోబాల్ విభాగంలో యువతులతో పాటు పెళ్లయిన మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. త్రోబాల్ పోటీల్లో 70 ఏళ్ల వృద్ధురాలు పాల్గొనడంతోపాటు తోటి వారిని ఉత్సాహపరచడం కనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల